సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం ¦ 26 ¦ జూలై ¦ 2024



దర్జాగా దోచేయ్

ఉచిత ఇసుక పేరులో స్టాక్ పాయింట్ల వద్ద ఇసుకను తెలుగు తమ్ముళ్లు యథేచ్ఛగా దోచేస్తున్నారు. నిబంధనలు మీరి లారీల్లో తరలించేస్తున్నారు. 8లో ▸



కొత్త చట్టాల అమలుకు సన్నద్ధం

ఐపీసీ స్థానంలో భారత న్యాయ సంహిత చట్టాలు అమలులోకి రాగా వీటిపై అవగాహన కల్పించేందుకు పోలీసు, న్యాయ శాఖలు శ్రీకారం చుట్టాయి. 8లో ▸



బీఎస్ఎన్ఎల్‌కు క్యూ

ప్రైవేట్ నెట్‌వర్క్ కంపెనీల టారిఫ్ పెంపు ప్రభావంతో బీఎస్ఎన్ఎల్ పోర్టబులిటీకి యూజర్లు క్యూ కడుతున్నారు. పెద్ద సంఖ్యలో బీఎస్ఎన్ఎల్‌కు మారుతున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

పునరావాస కేంద్రాలకు తరలిరండి



ప్రజలతో మాట్లాడుతున్న జేసీ ధాత్రిరెడ్డి

వేలేరుపాడు: భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారని, ముంపు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిరావాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సూచించారు. గురువారం ఆమె కట్కూరు గ్రామంలో పర్యటించి ప్రజలు, అధికారులు అప్రమత్తం చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు తాగు నీరు, నిత్యావసర సరుకులు అందించాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాల ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ కె.అద్దయ్య, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ మంజూ భార్గవి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్ రాజు పాల్గొన్నారు.

27న బీచ్ కబడ్డీ పోటీలు

వీరవాసరం: వీరవాసరంలోని మద్దాల రామకృష్ణమ్మ జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 27న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు కబడ్డీ అసోసియేషన్ జిల్లా సహాయక కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషులు 85 కిలోలు, మహిళలు 75 కిలోల బరువున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 2 నుంచి నెల్లూరు జిల్లా కోవూరు మండలం ఇందుకూరిపేటలో జరుగనున్న 11వ రాష్ట్రస్థాయి సీనియర్ బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 80741 53923లో సంప్రదించాలని కోరారు.

ఇళ్ల సర్వే పూర్తి

వేలేరుపాడు: పెద్దవాగు వరద ప్రభావిత గ్రామాల్లో ఇళ్ల నష్టంపై సర్వే పూర్తయినట్టు జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య తెలిపారు. గురువారం మండలంలో ఆయన పర్యటించారు. వేలేరుపాడు మండలంలోని 12 గ్రామాల్లో పాక్షికంగా, పూర్తిగా పలు ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. కమ్మరిగూడెంలో 150, అల్లూరినగర్‌లో 94, కోయమాధారంలో 89, రాళ్లపూడిలో 4, రామవరం ఇప్పలగుంపులో 13 ఇళ్లు దెబ్బతిన్నట్టు ప్రభుత్వానికి నివేదిక సమర్పించామన్నారు.

జీతాలివ్వకపోతే బతికేదెలా..

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలోని శానిటేషన్ వర్కర్లు, సెక్యూరిటీ సిబ్బందికి నెలల తరబడి జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనీ, తమకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మెడికల్ కాలేజీ వద్ద కార్మికులు గురువారం ధర్నా చేశారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.దత్తాత్రేయ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ కళాశాలలో సుమారు 35 మంది శానిటరీ వర్కర్లు, సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారని, పది నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వీరంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు.

మదర్ థెరిస్సా విగ్రహాన్నీ వదల్లేదు



మదర్‌థెరిస్సా విగ్రహ శిలాఫలకాన్ని మూసి వేసిన దృశ్యం

దెందులూరు: సేవకు ప్రతిరూపమైన భారతరత్న మదర్ థెరిస్సా విగ్రహాన్ని సైతం వదిలిపెట్టలేదు. విగ్రహ స్థూపానికి ఉన్న శిలాఫలకాన్ని కొందరు మూసివేశారు. దెందులూరు సీహెచ్‌సీ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, గౌడ సంఘం సభ్యులు కలిసి దెందులూరు సీహెచ్‌సీలో మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఆవిష్కరించారు. మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పేర్లతో విగ్రహ స్థూపానికి శిలాఫలకాన్ని ఏర్పాటుచేశారు. శిలాఫలకంపై మదర్ థెరిస్సా పేరును కూడా ముద్రించారు. అయితే ఇటీవల కొందరు శిలాఫలకాన్ని కాగితాలు అంటించి మూసివేశారని, ఇది మదర్ థెరిస్సాకు అవమానమని విగ్రహదాత ఏసుబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

● ముంపులో వరి..

స్వల్పకాల సాగు తప్పనిసరి



భారీ వర్షాలు, వరదలు సార్వా రైతులకు ఆదిలోనే అష్టకష్టాలు తెచ్చిపెట్టాయి. రోజుల తరబడి నీట మునిగి నాట్లు, నారుమడులు కుళ్లిపోవడంతో మరలా మొదటి నుంచి సాగు చేపట్టాల్సిందే. జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల్లో వరి నాట్లు తిరిగి వేయాల్సిన పరిస్థితి. ముంపు చేలలో ఖరీఫ్ సాగును సకాలంలో పూర్తి చేసేందుకు స్వల్పకాల వంగడాలు మేలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

వర్షం ముంచేను

- వర్షాలు, వరదలతో సార్వాకు తీవ్ర నష్టం
- పొలాలు నీట మునిగి కుళ్లిన నాట్లు
- సుమారు 40 వేల ఎకరాల్లో మరలా నాట్లు తప్పనిసరి
- నవంబర్‌లో ఖరీఫ్ పూర్తవకుంటే రబీకి అవస్థలు
- స్వల్పకాలిక వంగడాలు సాగు చేయాలంటున్న అధికారులు
- సామూహికంగా నారుమడులు వేసుకోవాలని సూచన



ముంపు పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

సాక్షి, భీమవరం: బంగాళాఖాతంలో అల్పపీడనం, గోదావరి వరద ప్రభావంతో జిల్లాలోని తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, భీమవరం, ఉండి తదితర నియోజకవర్గాల పరిధిలోని 40 వేల ఎకరాల్లో పంట పొలాలు, 1,600 ఎకరాల్లోని నారుమడులు నీట మునిగాయి. రోజుల తరబడి ముంపునీరు లాగక నాట్లు, నారుమడులు కుళ్లిపోయాయి. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధనా సంచాలకుడు డా.పీవీ సత్యనారాయణ, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డా. టి.శ్రీనివాస్, మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల బృందం నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఏ వంగడం సాగు చేశారు? ఎన్ని రోజుల క్రితం నాట్లు వేశారు? ఎన్నిసార్లు ఎరువులు వేశారు ? తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సీజన్‌లో అధిక శాతం విస్తీర్ణంలో రైతులు స్వర్ణ, సంపద స్వర్ణ, పీఎల్‌ఏ 1100 రకాలను సాగుచేసినట్టుగా గుర్తించారు. చాలాచోట్ల నాట్లు వేసి 10 రోజుల నుంచి నెల రోజుల వరకు కావడంతో పాటు పలు దఫాలుగా రైతులు ఎరువులు వేసినట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. వర్షాలు, వరద ప్రభావంతో వారం రోజుల పాటు పొలాలు ముంపులోనే ఉన్నాయి. ముంపు తీవ్రత ఎక్కువగా ఉండటం వలన నారు దెబ్బతిని మరలా నాట్లు వేయాల్సిన అవసరం ఉంటుందని శాస్త్రవేత్తల బృందం అభిప్రాయపడింది.

నీరు లాగేసిన పొలాల్లో..

రెండు, మూడు రోజులు ముంపునకు గురై నీరు లాగేసే పొలాల్లో నాట్లు త్వరగా నిలదొక్కుకునేందుకు ఎకరాకు 20 కిలోల పొటాష్, 20 కిలోల యూరియాను వేయాలని శాస్త్రవేత్తల బృందం సూచించింది. దీంతో పాటు లీటరు నీటికి కార్బెండిజం, మాంకోజెబ్ కలిసిన మిశ్రమం రెండు గ్రాములు లేదా కార్బెండిజం ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగుళ్ల బెడదను నివారించవచ్చని తెలిపింది.

అందుబాటులో విత్తనాలు

మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పలు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు శాస్త్రవేత్తల బృందం తెలిపింది. ఎంటీయూ 1156, ఎంటీయూ 1153 విత్తనాల కోసం విత్తన అధికారి జె.దయాళ్‌ప్రసాద్‌బాబు, సెల్: 9490 913434, ఎంటీయూ 1293 విత్తనం కోసం సత్యప్రియలలిత సెల్: 92488 38628లో సంప్రదించాలని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఈ వంగడాలు మేలు



ఎంటీయూ 1010, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153, ఎంటీయూ 1293, పీఆర్ 126 వంగడాలు డెల్టా ప్రాంతానికి అనువైనవిగా శాస్త్రవేత్తలు సిఫార్సు చేస్తున్నారు. ఈ రకాలు 125 రోజుల కాలపరిమితి కలిగి, చీడపీడలు తట్టుకుని ఎకరాకు 35 బస్తాల దిగుబడిని ఇస్తాయంటున్నారు. పొడవు, సన్నగింజ కలిగి ఉండటం వల్ల కాకినాడ పోర్ట్ ద్వారా ఎగుమతి మార్కెట్‌కి కూడా అనువుగా ఉండి మంచి గిట్టుబాటు ధర రావడానికి అవకాశం ఉంటుందంటున్నారు. ముంపు నీరు లాగేసిన మెరక పొలాలను గుర్తించి వాటిలో దెబ్బతిన్న పొలాలకు సరిపడా సామూహిక నారుమడి వేసుకుంటే ఇంకా నీరు లాగని పొలాలకు ఉపయోగపడుతుందని సూచిస్తున్నారు.

సార్వా సజావుగా సాగేందుకు..

నవంబరు చివరిలో వచ్చే తుపాన్ల బారిన పడకుండా ఉండటంతో పాటు రబీ (సార్వా) సజావుగా సాగేందుకు జూలై చివరి వారం నాటికి ఖరీఫ్ నాట్లు పూర్తిచేయాల్సి ఉంది. ఈ మేరకు తాడేపల్లిగూడెం నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో ముందుగానే తొలకరి నాట్లు వేశారు. కాగా భారీ వర్షాలు, వరదలతో జిల్లావ్యాప్తంగా 40 వేల ఎకరాల్లో మరలా నాట్లు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడినట్టు అంచనా. నవంబరు నెలాఖరుకు ఖరీఫ్ పూర్తిచేసుకుని డిసెంబరులో దాళ్వా పనులు చేపట్టాల్సి ఉంది. లేకుంటే వచ్చే ఏడాది మే నెల వరకు సాగు జరిగి దాళ్వా చివరిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. ఆ పరిస్థితులు ఏర్పడకుండా నిర్ణీత సమయానికి ఖరీఫ్ పూర్తిచేసేందుకు స్వల్పకాల వంగడాలు మేలని శాస్త్రవేత్తల బృందం సూచిస్తోంది.

రబీపై ప్రభావం పడకుండా..



రబీపై సాగుపై ప్రభావం పడకుండా ఉండేందుకు నిర్ణీత వ్యవధిలో ఖరీఫ్ పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మరలా నాట్లు వేయాల్సిన చోట శాస్త్రవేత్తలు సూచించిన విధంగా రైతులు స్వల్పకాల వంగడాలు సాగుచేయడం తప్పనిసరి. లేదంటే సాగు ఆలస్యమై రబీ చివరిలో నీటి ఎద్దడి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

– డాక్టర్ టి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ (వరి), మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం

హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలకు చర్యలు



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

కలెక్టర్ నాగరాణి

భీమవరం: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో హాస్టళ్ల అత్యవసర మరమ్మతులపై ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. విద్యార్థులకు చదువుతో పాటు మెరుగైన వసతి కల్పించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 46 ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలుండగా వాటిలో 35 హాస్టళ్లను ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారని, వాటి మరమ్మతులకు సుమారు రూ.2.65 కోట్ల అంచనాలు రూపొందించామన్నారు. ఎస్సీ వెల్ఫేర్‌కు సంబంధించి తాడేపల్లిగూడెం మండలం పరిమళ్ల, తణుకు బాలికలు, పాలకొల్లు ఆనంద నిలయం, పెంటపాడు బాయ్స్ అండ్ గరల్స్ వసతి గృహాలు, బీసీ వెల్ఫేర్‌కు సంబంధించి కాళీపట్నం, పాతపాడు వసతి గృహాలు, ఎస్టీ వెల్ఫేర్‌కు సంబంధించి భీమవరం వసతి గృహాల మరమ్మతులను అత్యవసరంగా చేపట్టాలని ఆదేశించారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, హౌసింగ్ ఈఈ జి.పిచ్చయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి గణపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవే కథోలిక పీఠం లక్ష్యం



వరద బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న బిషప్

ఏలూరు (ఆర్ఆర్ పేట): పేదలకు సాయం చేయడమే ఏలూరు కథోలిక పీఠం ముఖ్య ఉద్దేశమని ఏలూరు పీఠాధిపతి డాక్టర్ బిషప్ పొలిమేర జయరావు అన్నారు. గురువారం బిషప్ హౌస్‌లోని మహాగణ జయరావు పీఠాధిపత్య అభిషేక 11 వార్షికోత్సవ సందర్భంగా ప్రాంగణంలో పలు ప్రారంభోత్సవాలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పీఠంలో దివ్య సత్ప్రసాద నిత్య ఆరాధన మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కెథీడ్రల్ ఆలయంలో పీఠాధిపతులు దివ్య బలిపూజ సమర్పించారు. అనంతరం సోషల్ సర్వీస్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో వరద బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. ఫాదర్ టి.ఇమ్మానియేల్ మాట్లాడుతూ నిడదవోలు, తణుకు మండలాల్లోని వరద ప్రభావిత గ్రామాల్లోని 1,500 కుటుంబాలకు ఒక్కొక్కరికీ ఐదు కిలోల బియ్యాన్ని తక్షణ సాయం అందిస్తున్నామన్నారు. కార్డినల్ ఆంథోని పూల, ఫాదర్ బాబు జార్జ్, సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజస్, బిషప్ హౌస్ ప్రొక్యురేటర్ ఫాదర్ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

గురువులుగా పట్టాభిషేకం

ఏలూరు కథోలిక పీఠం పరిధిలో గురువులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ముగ్గురు ఫాదర్లకు గురువులుగా పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించారు.

వాహనాల తనిఖీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలకు రవాణా శాఖ అధికారులు జరిమానా విధించారు. ఉపరవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి ఆదేశాల మేరకు నగరంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అశోక్‌నగర్ బ్రిడ్జి వద్ద తనిఖీలు చేసి త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు, ఇన్సూరెన్స్ లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి జరిమానా విధించారు.

లంకలను వీడని వరద

గోదావరిలో స్థిరంగా నీటి ప్రవాహం

యలమంచిలి: గోదావరిలో నీరు స్థిరంగా కొనసాగుతుండగా లంక గ్రామాలను మాత్రం వరద వీడలేదు. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద బుధవారం గోదావరి ఒకింత తగ్గడంతో యలమంచిలి మండలంలోని కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, బాడవ గ్రామాల్లో అదేరోజు రాత్రికి రోడ్లపైకి నీరు చేరింది. గురువారం మధ్యాహ్నానికి వరద తగ్గుముఖం పట్టింది. అయితే భద్రాచలం, ధవళేశ్వరం వద్ద గోదావరిలో మళ్లీ వరద పెరుగుతుండటంతో శుక్రవారం కూడా వరద స్థిరంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు, పశు వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. కనకాయలంక, పెదలంక గ్రామాల్లో ప్రజలకు ముందస్తుగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. ఇది ఆగస్టు నెల కోటా అని, వరద సాయం కాదని అధికారులు చెబుతున్నారు. కనకాయలంక కాజ్‌వే మీద సుమారు 10 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రజల రాకపోకల కోసం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పడవలు నడుపుతున్నారు.



చించినాడు పుష్కరాల రేవు వద్ద ఒడ్డును తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి వరద నీరు



పెదలంకలో వరద నీటిలోనే గ్రామస్తుల రాకపోకలు



కనకాయలంకలోని ఓ కాలనీలో రోడ్డుపై వరద

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

ఏలూరు (టూటౌన్): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో ట్రాఫిక్ మెయింటినెన్స్‌లో భాగంగా కొన్ని రైళ్లను రద్దు చేయగా.. మరికొన్ని రైళ్లను దారి మళ్లిస్తున్నట్టు పీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

- విజయవాడ-నర్సాపూర్, విజయవాడ-భీమవరం మధ్య నడిచే రైళ్లను ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు రామవరప్పాడు వరకు నడపనున్నారు.
- ఏలూరు మీదుగా వెళ్లే 11 రైళ్లను విజయవాడ-గుడివాడ-భీమవరం-నిడదవోలు మార్గంలో నడపనున్నారు. ఎర్నాకులం-పాట్నా రైలును వచ్చే నెల 26 వరకు దారి మళ్లించారు.
- భావనగర్-కాకినాడ పోర్టు రైలును వచ్చేనెల 3 నుంచి 31 వరకు, ఎస్ఎంవీ బెంగళూరు-గౌహతి రైలును ఈ నెల 31 నుంచి వచ్చేనెల 30 వరకు, ఛత్రపతి శివాజీ టెర్మినల్-భువనేశ్వర్ రైలును వచ్చే నెల 2 నుంచి 31వ తేదీ వరకు దారి మళ్లించారు.
- ధన్‌బాద్-అలప్పుజా (13351) రైలును ఈనెల 29, వచ్చే నెల 1వ తేదీల్లో, టాటా-యశ్వంత్‌పూర్ రైలును వచ్చేనెల 29 వరకు, జాసిద్ది-తాంబ్రమ్ (12376) రైలును ఈనెల 31 నుంచి వచ్చే నెల 28 వరకు దారి మళ్లించారు.
- హాతియా-ఎర్నాకులం (22837) రైలును ఈనెల 29 నుంచి వచ్చేనెల 26 వరకు, హాతియా-ఎస్ఎంవీ బెంగళూరు (18637) రైలును వచ్చేనెల 3 నుంచి 31 వరకు దారి మళ్లించారు.
- హెచ్‌టీఈ-ఎస్ఎంవీ బెంగళూరు (12835) రైలును ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 1 వరకు, టాటా-ఎస్ఎంవీ బెంగళూరు (12889) రైలును వచ్చేనెల 2 నుంచి 30 వరకు దారి మళ్లించారు.
- వీటిలో పలు రైళ్లకు ఏలూరు, తాడేపల్లిగూడెంలో హాల్ట్ ఉంది.

సాంకేతిక ఆలోచనలతో ఉపాధి అవకాశాలు

జిల్లా ఎస్పీ శివకిషోర్



నూజివీడు ట్రిపుల్‌ఐటీలో మాట్లాడుతున్న ఎస్పీ శివకిషోర్

నూజివీడు: విద్యార్థులు చదువు ద్వారా సంపాదించుకునే జ్ఞానం దేశానికి ఉపయోగపడాలని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు సైబర్ క్రైమ్, సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలు తదితరాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు పరిస్థితులు, ప్రభావం, సమాజం తదితర అన్ని అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న సాంకేతికతపై దృష్టి సారించాలన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థిగా అప్లికేషన్ డెవలప్‌మెంట్, వెబ్‌సైట్ డెవలప్‌మెంట్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌పై ఆలోచనలతో మెరుగైన ఉపాధి పొందవచ్చన్నారు. పోలీసు శాఖతో కలిసి సామాజిక దురాచారాలను నిర్మూలించేందుకు సాయపడాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఎస్పీ శివకిషోర్‌ను ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ శాలువాతో సత్కరించారు. డీఎస్పీ గోలి లక్ష్మయ్య, నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఆర్జీయూకేటీ నూజివీడు డీన్ అకాడమిక్స్ రత్నాకర్, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, టౌన్ ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

గంజాయి, జూదాలపై ఉక్కుపాదం

గంజాయి నిరోధానికి ప్రత్యేక దృష్టి పెట్టామని జిల్లా ఎస్పీ శివకిషోర్ స్పష్టం చేశారు. నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్, రూరల్ సర్కిల్ కార్యాలయం, టౌన్ పోలీస్ స్టేషన్‌లను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి నిరోధానికి చర్యలు తీసుకుంటామన్నారు. నేరాల నిరోధానికి ప్రజలూ సహకరించాలని కోరారు. కోడిపందేలు, జూదాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. నూజివీడులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.



క్లుప్తంగా

పంట నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోండి



వెబినార్‌లో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ హార్టీకల్చర్ కె.శ్రీనివాసులు

తాడేపల్లిగూడెం: ఉద్యాన పంటలలో భారీ వర్షాల వల్ల సంభవించిన నష్టాన్ని తగ్గించడానికి జాగ్రత్తలు తీసుకుంటే మేలని వెంకట్రామన్నగూడెంలోని రైతు సలహా కేంద్రం ద్వారా గురువారం నిర్వహించిన వెబినార్‌లో డైరెక్టర్ ఆఫ్ హార్టీకల్చర్ కె.శ్రీనివాసులు సూచించారు. ప్రధాన ఉద్యాన పంటల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెబినార్‌లో వివరించారు. అరటి, బొప్పాయి, వంగ, మిరప, కంద, చామ, బంతి, మల్లె, తమలపాకు, కోకో, ఆయిల్‌పామ్ పంటల విషయంలో తీసుకోవాల్సిన పద్ధతులను విశదీకరించారు. ఉద్యాన వర్సిటీ పరిశోధన సంచాలకులు ఎల్.నారం నాయుడు, విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ, శాస్త్రవేత్తలు కేటీ వెంకటరమణ, సి.వెంకటరమణ, ఆర్.నాగరాజు, ఎం.తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

జాలర్ల వలలో భారీ చేప



గడ్డిమోసు చేపను సిద్ధాంతం మార్కెట్లో అమ్ముతున్న వ్యాపారులు

పెనుగొండ: గోదావరిలో 10 కేజీల గడ్డిమోసు చేప జాలర్ల వలకు చిక్కింది. గురువారం నడిపూడి ప్రాంతంలో గోదావరి నది ఒడ్డున జాలర్లు వేట సాగిస్తుండగా ఈ భారీ చేప వలకు చిక్కింది. దీనిని సిద్ధాంతం మార్కెట్లో అమ్మకానికి పెట్టగా రూ.3,500 ధర పలికిందని వ్యాపారి కర్రి రాంబాబు తెలిపారు. మాంసం ప్రియులు వాటాలు వేసుకుని మరీ ఈ భారీ చేపను కొనుగోలు చేయడం విశేషం.

రాగి విద్యుత్ తీగల చోరీ

యలమంచిలి: ఆక్వా చెరువు వద్ద ఉంచిన రాగి విద్యుత్ తీగలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. కలగంపూడి గ్రామానికి చెందిన పాత్తూరి కిరణ్ కుమార్‌రాజు ఆక్వా చెరువు వద్ద ఉన్న రాగి విద్యుత్ తీగలను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. వీటి విలువ సుమారు రూ.20 వేలు ఉంటుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై కాకి శివనారాయణ గురువారం చెప్పారు.

లారీ నింపేయ్.. దర్జాగా దోచేయ్

- స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక దోచేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- ఒకరికి 20 టన్నులు మాత్రమే నిబంధన తుంగలోకి..
- సిబ్బంది మొత్తుకుంటున్నా దౌర్జన్యంగా లారీల్లోకి లోడింగ్

ఏలూరు టౌన్ : 'ప్రజలకు ఉచిత ఇసుక అందిస్తాం, ఇసుక దోపిడీ లేకుండా చిత్తశుద్ధితో పనిచేస్తాం'.. ఇది అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు. కానీ క్షేత్రస్థాయిలో తెలుగు తమ్ముళ్లు చేస్తున్న పనులు దీనికి భిన్నంగా ఉన్నాయి. అధికారం ఉన్నప్పుడే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలన్న అత్రుతతో కూటమి నాయకులు నిబంధనలను తుంగలో తొక్కుతూ తమకు అనుకూలంగా వ్యవహరించాలంటూ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తాము చెప్పిన మేరకు ఇసుకను లారీలలో నింపాల్సిందేనంటూ ఒత్తిడి చేస్తున్నారు. అదేమని ఎవరైనా అడిగినా, విలేకరులు వార్తలు రాసినా దాడులు చేస్తామంటూ బహిరంగంగా హెచ్చరిస్తున్నారు. అధికారంలో ఉన్నామని, ఇసుకపై పెత్తనం కూడా తమదేనంటూ తెలుగుదేశం పార్టీ జెండాలను ఇసుక గుట్టలపై గుచ్చుతున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక తమ విధులకు ద్రోహం చేయలేక తమను విధుల నుంచి తప్పించాలంటూ అధికారులను వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. కుక్కునూరు మండలంలో ఇబ్రహీంపేట, వింజరం గ్రామాల్లో రెండు ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఇక్కడి ఇసుకను తమ అవసరాన్ని బట్టి స్థానికులు ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి తీసుకుని వెళ్లవచ్చు. ఒక్కరికి రోజుకు 20 టన్నులు మాత్రమే ఇవ్వాలనేది నిబంధన. అయితే ఈ నిబంధనలను అమలు చేసేందుకు ఇక్కడి స్టాక్ పాయింట్‌ల వద్ద ఎటువంటి వే‌బ్రిడ్జ్‌లు లేవు. దీనిని ఆసరాగా చేసుకుని రంగంలోకి దిగిన అధికార పార్టీ నాయకులు 40 టన్నుల ఇసుక నింపే కెపాసిటీ గల టిప్పర్ లారీలను తీసుకువచ్చి లారీ నిండుగా నింపాలంటూ స్టాక్ పాయింట్ వద్ద విధులు నిర్వహించే ఉద్యోగులపై ఒత్తిడి తెస్తున్నారు. అలా చేయడం కుదరదని తెగేసి చెప్పినా వినకుండా బలవంతంగా ఇటీవల మూడు లారీలలో ఇసుకను లోడ్ చేయించుకోవడంతో అక్కడ విధులు నిర్వహించే ఉద్యోగులు స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు పోలీసులు లారీలను పట్టుకున్నట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం కూడా ఇసుకను అక్రమంగా తెలంగాణకు తరలించేందుకు యత్నించడం.. ఆ విషయం పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో వారి ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు లారీని పట్టుకునేందుకు వెళ్లగా లారీ నుంచి ఇసుకను సగం అన్‌లోడ్ చేసి పారిపోయేయత్నం చేసినట్టు సమాచారం. ఈ విషయంలో కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు కేసు నమోదు చేయకుండా వదిలేసినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అధిక లోడ్‌తో వెళుతుండగా పోలీసులు పట్టుకున్న లారీలు



ఇబ్రహీంపేటలో స్టాక్ పాయింట్ వద్ద ఇసుక గుట్టపై ఉంచిన టీడీపీ జెండా



ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ వద్ద ఇసుక నిల్వలను కొలతలు వేస్తున్న అధికారులు

అక్రమ రవాణాపై విచారణ వేగవంతం

కుక్కునూరు: ఇసుక అక్రమ రవాణాపై అధికారులు విచారణ చేపట్టారు. గురువారం మండలంలోని స్టాక్ పాయింట్‌ల వద్ద మైనింగ్, ల్యాండ్ సర్వే, ఆర్టీఓ శాఖల అధికారుల బృందం ఇసుక నిల్వలు ఎంత ఉన్నాయో కొలతలు తీసుకున్నారు. ఉచిత ఇసుక విధానం ప్రారంభానికి ముందు రెవెన్యూ అధికారులకు స్టాక్ పాయింట్ అప్పజెప్పే ముందు స్టాక్ పాయింట్‌లో ఎంత ఇసుక ఉంది, అధికారికంగా ఎంత ఇసుక అమ్మారు. అనధికారికంగా ఎంత తరలించారు. ప్రస్తుత నిల్వలు ఎంత ఉన్నాయనే విషయాలపై ఆరా తీశారు. ఇప్పటికే అధికారులు సీసీ పుటేజీలు, రశీదులను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. లారీలను సీజ్ చేసిన అధికారులు లారీ డ్రైవర్లపై, జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

జేసీబీ మార్చేశారు?

ఇసుకను లారీలలో లోడు చేసేందుకు అధికారులు జేసీబీని ఏర్పాటు చేశారు. కాగా లారీ పట్టుబడటానికి ముందు అధికారుల ప్రమేయం లేకుండా జేసీబీని మార్చి దాని స్థానంలో ఎక్కువ హార్స్ పవర్ కలిగిన పొక్లెయిన్‌ను లారీలలో ఇసుకను నింపేందుకు వినియోగించినట్టు సమాచారం. స్థానిక సిబ్బంది వారిస్తున్నా నలుగురు వ్యక్తులు బలవంతంగా లారీలలో ఇసుకను లోడ్ చేసినట్టు తెలుస్తోంది. వీరు ఎవరనే విషయమై అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం.

స్టాక్ పాయింట్‌లను పరిశీలించిన జేసీ



వింజరం స్టాక్ పాయింట్ వద్ద సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న జేసీ ధాత్రిరెడ్డి

కుక్కునూరు: మండలంలోని ఇసుక స్టాక్ పాయింట్‌లపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి గురువారం వింజరం, ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్‌లను పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లలో ఎంత ఇసుక ఉంది, ఎంత అమ్మకం జరిగిందనే వివరాలను స్థానిక తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ పాయింట్‌ల వద్ద వేరే మండలానికి చెందిన సిబ్బందిని విధుల్లో నియమించాలని సూచించినట్టు సమాచారం. ఆమె వెంట తహసీల్దార్ పి.అచ్యుతాకుమారి, స్థానిక రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మద్యం దుకాణంలో అగ్ని ప్రమాదం

భీమవరం : భీమవరం పట్టణ శివారు తాడేరు రోడ్డులోని ప్రభుత్వ మద్యం షాపులో అగ్నిప్రమాదం సంభవించింది. బుధవారం రాత్రి షాపును మూసివేసిన తరువాత షాపులోపల నుంచి పొగలు రావడంతో నైట్‌వాచ్‌మెన్ గుర్తించి షాపు సూపర్‌వైజర్‌కు తెలియచేయడంతో అగ్నిమాపక సిబ్బంది సమాచారం ఇచ్చి మంటలను అదుపు చేయించారు. సంఘటన ప్రాంతాన్ని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, ఎస్ఈబీ అధికారులు పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ పర్యవేక్షణలో ప్రమాదానికిగల కారణాలు, నష్టాన్ని అంచనా వేస్తున్నారు. షాపులో సుమారు రూ.40 లక్షల విలువైన 16,400 మద్యం సీసాలున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రమాద సమయంలో షాపు లాకర్‌లో సుమారు రూ.1.85 లక్షల నగదు భద్రంగా ఉందని, అయితే షాపు ముందు భాగంలో మద్యం సీసాలు ప్రమాదంలో కాలిపోయాయన్నారు. వెనుక భాగంలో ఉన్న మద్యం సీసాలకు ఎటువంటి నష్టం కలగలేదని విజయవాడ నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.



అగ్నిప్రమాదంలో కాలిపోగా మిగిలిన మద్యం బాటిల్స్

కొత్త చట్టాల అమలుకు సన్నద్ధం

- ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారత న్యాయ సంహిత చట్టాలు
- ప్రజల్లో విస్తృత అవగాహన కోసం పోలీసు, న్యాయ శాఖల శ్రీకారం
- వేగంగా కేసుల పరిష్కారం.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా తీర్పులు



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ (ఫైల్)

ఏలూరు (టూటౌన్) : దేశంలో 160 ఏళ్ల నుంచి అమలులో ఉన్న పాత చట్టాలను ప్రస్తుత సమాజ పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవాలన్న డాక్టర్ రణబీర్ సింగ్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం భారతదేశ న్యాయ వ్యవస్థలో నూతన చట్టాలను రూపొందించింది. బ్రిటీష్ కాలం నుంచి ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ 1860 స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), సీఆర్‌పీసీ 1973 స్థానంలో భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) చట్టాలుగా మార్పు చెందాయి. జూలై ఒకటో తేదీ నుంచి అమలులోకి వచ్చిన ఈ నూతన చట్టాలపై అవగాహన కల్పించేందుకు పోలీసు, న్యాయశాఖ సన్నద్ధమయ్యాయి. చట్టాల తీరు, విధివిధానాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి.

ఎఫ్ఐఆర్ లేకుండానే ప్రాథమిక విచారణ

ఈ ఏడాది జూలై 1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి వచ్చాయి. నూతన చట్టంలో ఈ–ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్‌కు చోటు లభించింది. కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్ లేకుండానే ప్రాథమిక విచారణలో నేరం జరిగినట్లు రుజువైతే ఎఫ్ఐఆర్ నమోదు ఉంటుంది. నూతన చట్టాల ప్రకారం న్యాయమూర్తులు కేసులను రెండు వాయిదాలకు మించి ఎక్కువ రోజులు పొడిగించడానికి వీలుండదు. పోలీస్ శాఖకు పూర్తి అధికారాలు ఉండటంతో కేసు త్వరగా పూర్తవుతుంది. కొత్త చట్టం ద్వారా దర్యాప్తు అధికారులకు అధికారాలను ఎక్కువ కట్టబెట్టారని న్యాయవాదులు అభిప్రాయపడుతుండగా, బాధితులకు భరోసా, భద్రత కలుగుతుందన్నది పోలీసు అధికారులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు.

చిన్న కేసులైనా జైలు శిక్ష

- నూతన చట్టాల ద్వారా దొంగతనం, గొలుసు చోరీ, చిన్న చిన్న కేసుల్లో సైతం నిందితులు అరెస్ట్ అయి జైలుకు వెళ్లక తప్పదు.
- ఫోన్‌లో దూషించినా, ఫొటోల మార్ఫింగ్‌కు పాల్పడుతూ ఇబ్బందులు గురిచేసినా కఠినమైన శిక్షలు ఎదుర్కోవాలి.
- మహిళలపై జరిగే దాడులు, లైంగిక వేధింపులు, పోక్సో కేసుల్లో రెండు నెలల్లోపు పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి ఛార్జీషీటు వేయాలి.
- కాలయాపన జరగకుండా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా నేరస్తులకు శిక్ష ఖరారు చేయనుండటంతో బాధితులకు భరోసా కలుగుతుంది.
- దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, విజిలెన్స్ విభాగాలకు దర్యాప్తు అధికారాలను నూతన విధానంలో అధికంగా కల్పించారు.
- జీరో ఎఫ్ఐఆర్ కాలయాపన జరగదు. బాధితులకు తక్షణ సాయం అందుతుంది.
- 15 ఏళ్లలోపు వారు, 60 ఏళ్లు పైబడిన వారు పోలీస్‌స్టేషన్‌కు రాకుండా వారి నుంచి పోలీసు అధికారులు సాక్ష్యాధారాలను స్వీకరించాల్సి ఉంటుంది.
- ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసుకునే సౌకర్యం కల్పించినప్పటికీ మూడు రోజుల్లోగా ఫిర్యాదుదారులు స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాల్సి ఉంటుంది.
- చిన్నపాటి నేరాలకు పాల్పడిన నేరస్తుల్లో పరివర్తన తీసుకువచ్చే విధంగా కమ్యూనిటీ సర్వీస్ చేసేలా శిక్షలు ఉన్నాయి.
- బాధితులకు న్యాయం ఏ విధంగా జరుగుతుందనే విషయాన్ని కేసు నమోదు చేసిన 90 రోజుల లోపు దర్యాప్తు అధికారులు చెప్పాల్సి ఉంటుంది.
- ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా బాధితుల స్టేట్‌మెంట్ రికార్డు చేసే అవకాశం ఉంది. ఈ–సాక్షి, సంకలన్ వంటి యాప్‌లను పోలీస్ యంత్రాంగం కలిగి ఉండాలి.

27, 28 తేదీల్లో బాలికల చెస్ రాష్ట్ర పోటీలు

భీమవరం: అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో భీమవరంలో ఈనెల 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయి అండర్–11 ఓపెన్ అండ్ గరల్స్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రా చెస్ అసోసియేషన్, జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో పట్టణంలోని ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలు అక్టోబర్ 3వ తేదీ నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి అండర్–11 ఓపెన్ అండ్ గరల్స్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని కిషోర్ చెప్పారు. ఇతర వివరాల కోసం 90632 24466 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
(రెవెన్యూ సెక్షన్, తిరుపతి)
Roc. No.REV-1-TTD- 47022(32)/17/ 2024, Dt: 24.07.2024

తిరుమల తిరుపతి దేవస్థానమునకు చెందిన వ్యవసాయ భూమి విస్తీర్ణం ఎ.14.98 1/2 సెంట్లు కలిగిన భూములు కౌలుకి మూడు (03) సంవత్సరములకు ఇవ్వడానికి నిర్ణయించారు. ఆసక్తి యున్నవారి నుండి సీల్డు టెండర్ ఆహ్వానించడమైనది. టెండర్ సహిత వేలం తేది: 12.08.2024 ఉ॥ 11.00 గం.లకు స్థలము గ్రామ సచివాలయము, పరిమెళ్ళ గ్రామము పెంటపాడు మండలము, భీమవరం జిల్లా నందు టెండర్ ఆహ్వానించడమైనది. వివరముల కొరకు తిరుమల తిరుపతి దేవస్థానములు అధికారిక వెబ్‌సైట్ https:www.tirumala.org లేదా ఫోన్ నెం.0877-2264248 పై సంప్రదించగలరు.

Roc No:TTD-40021(31)/1/2024-PRO SEC(Adv No.86) Dt: 25.07.2024 కార్యనిర్వహణాధికారి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అడవిపాలెం వద్ద ప్రమాదం దృశ్యం

యలమంచిలి: అడవిపాలెం రజకుల చెరువు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన కప్పల సునీల్ (33) పాలకొల్లులోని శ్రీరామ్ చిట్స్‌లో పనిచేస్తుంటాడు. గురువారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగి బైక్‌పై వెళుతుండగా అదే గ్రామానికి చెందిన చిట్టూరి దుర్గాప్రసాద్ లిఫ్ట్ అడగడంతో అతనిని ఎక్కించుకున్నాడు. అడవిపాలెంలోని రజకుల చెరువు వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీని క్రాస్ చేస్తుండగా, ఎదురుగా మరో బైక్ అడ్డు రావడంతో అదుపుతప్పి పడిపోయినట్లు స్థానికులు చెప్పారు. ఈ ప్రమాదంలో సునీల్, దుర్గాప్రసాద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా సునీల్ మృతి చెందాడు. దుర్గాప్రసాద్‌కు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28న బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: నగరంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో ఈ నెల 28వ తేదీన బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో ప్రతిభ చూపిన వారిని చిత్తూరు జిల్లాలో ఆగస్టులో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల బాస్కెట్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2011 జనవరి ఒకటో తేదీ తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు ఒరిజినల్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో సాయంత్రం 3 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 77804 84313, 94403 49534 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీను ప్రకటనలో కోరారు.

ప్రేరణకు ఎంపికైన అనుశ్రీని అభినందించిన ఎంపీ



అనుశ్రీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం ప్రేరణకు ఎంపికైన ఏలూరుకు చెందిన అనుశ్రీని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అభినందించారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 10 జిల్లాల నుంచి 20 మందిని ఈ శిక్షణ కార్యక్రమానికి ఎంపిక చేయగా, రాష్ట్రం నుంచి ఏలూరుకు చెందిన అనుశ్రీ ఎంపిక కావడం ఏలూరు జిల్లా వాసులకు గర్వకారణమన్నారు. ప్రేరణ అనేది యువతలో సాధికారత కల్పించే రూపాంతరమైన అనుభవ పూర్వక అభ్యాస కార్యక్రమమన్నారు.

బీఎస్ఎన్ఎల్ పోర్టబిలిటీకి క్యూ

- ప్రైవేట్ నెట్‌వర్క్ కంపెనీల టారిఫ్‌ల భారీ పెంపు ప్రభావం
- బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు మళ్లుతున్న వినియోగదారులు
- పెరుగుతున్న పోర్టబిలిటీల సంఖ్య
- డిసెంబర్ చివరి నాటికి 4జీ సేవలకు మెరుగుపడే అవకాశం
- అదనపు టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న అధికారులు



ఏలూరు ప్రధాన కార్యాలయంలో పోర్టబిలిటీ కోసం వచ్చిన వినియోగదారులు

ఏలూరు (టూటౌన్) : ప్రైవేట్ టెలికాం కంపెనీలు ఇటీవల టారిఫ్‌లు భారీగా పెంచిన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ వైపు మళ్లుతున్నారు. ప్రైవేట్ టెలికాం కంపెనీలైన ఎయిర్‌టెల్, జియో, వీఐ(వొడా ఫోన్)లు తమ టారిఫ్‌లను భారీగా పెంచాయి. దీంతో సోషల్ మీడియాలో వాటి తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో వినియోగదారులు పోర్టబిలిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌కు మారుతున్నారు.

టెలికాం రంగంలో ప్రైవేట్ సంస్థల ధాటికి తట్టుకోలేక తన ప్రాభవాన్ని కోల్పోతున్న ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ తిరిగి రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ తన ఉనికిని చాటుకుంటోంది. ప్రైవేటు సంస్థల టారిఫ్‌లు విపరీతంగా పెంచేసిన నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ప్రత్యేక ప్యాకేజీలతో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బీఎస్ఎన్ఎల్‌కు తిరిగి ఆదరణ కనిపిస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి 4జీ సేవలు సైతం బీఎస్ఎన్ఎల్ అందుబాటులోకి తీసుకువస్తుండటంతో వినియోగదారులు సైతం ఈ సేవల వైపు చూస్తున్నారు. మరో పక్క 4జీ సేవలకు అవసరమైన టవర్ల ఏర్పాటుకు, ఆప్టికల్ ఫైబర్ అమలులో వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలను అందించేందుకు వీలుగా బీఎస్ఎన్ఎల్ కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

టారిఫ్ వార్‌తో మంచిరోజులు

టెలికాం రంగంలో దిగ్గజ సంస్థ అయిన జియో సహా ఎయిర్‌టెల్, వోడా+ఐడియా, ఇతర సంస్థలు పెంచిన కొత్త టారిఫ్‌లు ఈ నెల మొదటి వారం నుంచి అమలులోకి వచ్చాయి. అయితే ఈ టారిఫ్‌లు పెనుభారంగా మారడం, సరిగ్గా ఇదే సమయంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ ప్రత్యేక టారిఫ్‌లపై తీసుకున్న నిర్ణయం ఆ సంస్థకు ఊపిరి పోసినట్లయింది. నెలకు కేవలం రూ.200 రీచార్జితో వినియోగదారులను తన వైపు తిప్పుకుంది. ఫలితంగా ప్రైవేట్ సంస్థల వినియోగదారులు పెద్ద సంఖ్యలో పోర్టబిలిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌కు మారిపోతున్నారు.

20 రోజుల వ్యవధిలో 5 వేల మంది

గత 20 రోజుల వ్యవధిలోనే దాదాపు 5 వేల మంది వరకు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు పోర్టబిలిటీ ద్వారా మారినట్లు సంస్థ సిబ్బంది చెబుతున్నారు. ప్రైవేట్ టెలికాం సంస్థలతో పోలిస్తే బీఎస్ఎన్ఎల్ టారిఫ్ రేట్లు తక్కువగా ఉండటంతో వినియోగదారుల చూపు బీఎస్ఎన్ఎల్ వైపు పడింది.

మెరుగైన సేవలందిస్తాం

గత కొన్ని రోజులుగా బీఎస్ఎన్ఎల్‌కు వినియోగదారుల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఎన్నడూ లేనివిధంగా ప్రైవేట్ సంస్థల నుంచి పోర్టబిలిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌కు మారడంతో పాటు కొత్త సిమ్‌ల కొరకు సంస్థ కార్యాలయాలు, ఫ్రాంఛైజీలు, ఔట్‌లెట్‌ల వద్ద బారులు తీరుతున్నారు. ప్రైవేట్ టెలికాం సంస్థలు మొబైల్ రీచార్జీ ధరలు విపరీతంగా పెంచడంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్నారు. వినియోగదారుల ఆకాంక్షలకు అనుగుణంగా తమ సంస్థ నుంచి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తాం.

– ఎల్.శ్రీను, ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

సాక్షి క్లాసిఫైడ్స్



SINGLE SITTING

■ SINGLE SITTING : 10th, 12th, B.A, B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., MBA, BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing (For Dropouts / Back Logs) from recognised Universities, Exams in August. ✆ : 73383 76874 [R-611]



■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185270]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185366]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000- 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph : 9014885406 [HA-412]

■ ఘంటా పేరయ్య మెమోరియల్ (స్వాతంత్ర్య సమరయోధుల-1930) వైద్య సేవా నిర్వహణ కొరకు నర్సు ట్రైనింగ్ (పాస్/ఫెయిల్) వారు పూర్తి బయోడేటా (సెల్ఫ్ అడ్రస్ 4"x9" పోస్టల్ కవర్, వాట్సాప్ నెం.)తో సంప్ర. డాక్టర్ జి.యల్. రావు, ముదినేపల్లి-521 325, ఆంధ్ర. [B-790443]

■ Wanted Teacher, Social Studies For High School with B.Ed, ST.Lucy E.M High School, Janampet, Vijayarai, Eluru Dist, Cont : 06281189162, email - Id : lucyfilipinischool@gmail.com [C-800338]

■ Wanted B.Com / M.Com / MBA Finance / CA IPCC Dropouts to be work as field Executive in Bhimavaram / Tadepalli Gudem in a reputed Audit Firm. Interested persons (male only) Contact No. 70135 11502 for Further Information or mail to : kowthahr@gmail.com [B-173]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



క్లుప్తంగా

బాలికలు మంచి చెడులను గ్రహించాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలు మంచి, చెడు స్పర్శలను గ్రహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8, 9, 10వ తరగతి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు చేయరాదని, దానివల్ల కలిగే అనర్థాలను బాలికలకు వివరించారు. మైనర్ బాలికలకు వివాహాలు చేస్తే 1098 నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డి.శ్రీనివాసరావు, జీఎంఎస్‌కే, అంగన్‌వాడీ టీచర్లు ఎ.తులసీ రాణి, కే.గీత, టి.రామలక్ష్మి, పి.అంజికుమారి, ఎం.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి

తణుకు టౌన్: ఆషాడమాసం సందర్భంగా తణుకులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, కార్యదర్శి మాజేటి కాశీ, కొల్లేపర సత్యనారాయణ, శీమకుర్తి చంద్రికారత్నం, పెరుమాళ్ల ఉమామహేశ్వరిలతో పరిసర గ్రామాల మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

27న రంగస్థల కళాకారుల వార్షికోత్సవం

తాడేపల్లిగూడెం (టీటీసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 44వ వార్షికోత్సవ కార్యక్రమం స్థానిక ఓవర్ బ్రిడ్జి దిగువున విశ్వ బ్రాహ్మణ సంఘం కల్యాణ మండపంలో ఈ నెల 27వ తేదీన శనివారం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారి తగరంపూడి మురళీకృష్ణలు వెల్లడించారు. మేళా తాళాలతో, కోలాట భజనలతో నటరాజ స్వామి విగ్రహ ఊరేగింపు జరుగుతుందని వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు, ఏకపాత్రాభినయాలు, సంకీర్తనలు, బుర్రకథ, నాటక దృశ్యాలు, కళా ప్రదర్శనలు, సినీ సంగీత విభావరి, సభ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

ఘనంగా కార్గిల్ విజయ దివస్ ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీలో నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో గురువారం రాత్రి కార్గిల్ విజయ దివస్ క్యాండిల్ నిర్వహించారు. కార్గిల్ విజయం భారతదేశ చరిత్రలో సువర్ణ అధ్యాయమని భారతీయ జనతా పార్టీ ఎక్స్ సర్వీస్ మెన్ రాష్ట్ర కన్వీనర్ టి.బోగేశ్వరరావు తెలిపారు. ఆర్టీసీ బస్సు స్టాండ్ నుంచి పోలీస్ ఐలాండ్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు. జనతా పార్టీ, వివిధ పార్టీల నాయకులతో, పోలీస్ అధికారులతో నిర్వహించారు.

ముంపు నిర్వాసితులకు సేవా కార్యక్రమాలు


నిర్వాసితులకు ఆహారం అందజేస్తున్న సభ్యులు

తణుకు: మండలంలోని దువ్వ గ్రామంలో వెంకయ్య వయ్యేరు కాలువ ముంపునకు గురైన నిర్వాసితులకు తణుకు పీస్ ఆఫ్ యూత్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం భోజన ఏర్పాట్లు చేశారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అబ్బదాసరి లాజర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పేదలు, నిర్వాసితులకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సభ్యులు బొంతు అర్కే, అబ్బదాసరి సాలేమాన్, అబ్బదాసరి కల్యాణ్, తానేటి సుధాకర్, యార్లగడ్డ దాసు, కంకిపాటి వెంకటేశ్వరరావు, గంగు బాయ్, అబ్బదాసరి జానీ, చదలవాడ తిమోతీ పాల్గొన్నారు.

దోమల వృద్ధిని అరికట్టాలి

తాడేపల్లిగూడెం రూరల్: దోమలు పెరగకుండా ప్రజలంతా అరికట్టాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఫ్రైడే, డ్రైడే, వెక్టార్ కంట్రోల్, ఫీవర్ సర్వే, హైజీన్ వంటి కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ లార్వా దశలోనే దోమలను నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.

అదిరిపోతున్న అద్దెలు

- అద్దె గలగల.. వ్యాపారం విలవిల..
- ప్రతి ఏడాదీ పెరుగుతున్న అద్దెలు..
- వ్యాపారాలు లేక విలవిల్లాడుతున్న వ్యాపారులు..
- ఖాళీ అవుతున్న అద్దె భవనాలు..


తణుకు రాష్ట్రపతి రోడ్డులో దుకాణాలు


తణుకులో జిల్లా పరిషత్ దుకాణాలు

తణుకు అర్బన్: పారిశ్రామికంగాను, వ్యాపార వాణిజ్యపరంగాను వేగంగా అభివృద్ధి చెందిన తణుకు ప్రాంతం ప్రస్తుతం వ్యాపార రంగంలో ఏర్పడ్డ ఒడిదుడుకుల మధ్య కునారిల్లుతోంది. పట్టణ ప్రాంతం విస్తరించి ఇతర ప్రాంతాల నుంచి తణుకు ప్రాంతానికి పిల్లల విద్య, వ్యాపారం, రిటైర్మెంట్ అనంతరం తణుకు ప్రాంతంలో స్థిరపడాలనే తాపత్రయంతో ప్రజలు వలసలుగా వస్తున్నప్పటికీ వ్యాపారరంగం పుంజుకోకపోగా పతనం అయ్యే దిశగా పయనిస్తుండడం వ్యాపారులను కలవరపెడుతోంది. అసలు వ్యాపారం జరిగేదే తక్కువ అంటే ఇక దుకాణ అద్దెలు భారీగా పెరిగిపోయి వ్యాపారులకు భారంగా మారుతున్నాయి. రెండు నుంచి మూడేళ్లకోసారి దుకాణ అద్దెలు యజమానులు పెంచుతుండడంతో జరిగే వ్యాపారానికి దుకాణ అద్దెలు, సిబ్బంది జీతాలు, ఇతర ఖర్చులను బేరీజు వేసుకుంటే వ్యాపారాలు కిట్టడంలేదంటూ వ్యాపారస్తులు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా తణుకు ప్రధాన వీధుల్లో రూ. 20 వేలు నుంచి రూ. 70వేలకు పైగా అద్దెలు పలుకుతున్నాయంటే పరిస్థితి ఏంటో అర్థమవుతోంది. తణుకు రాష్ట్రపతి రోడ్డులోని జిల్లా పరిషత్ దుకాణాలకు గతంలో నిర్వహించిన వేలంపాటలో అత్యల్పంగా రూ. 15వేలు నుంచి అత్యధికంగా రూ. 20వేల వరకు, దేవాదాయ శాఖకు చెందిన దుకాణాలు అత్యల్పంగా రూ.13 నుంచి అత్యధికంగా రూ. 35 వేలకు అద్దెలు చెల్లిస్తున్నట్లు దుకాణదారులు చెబుతున్నారు. రాష్ట్రపతి రోడ్డులో కొన్ని ప్రధాన దుకాణాలు రూ. 1 లక్షకు పైగా అద్దెలు నిర్దేశించబడి ఉన్నాయి. ఏదోక వ్యాపారం చేయాలనే తపనతో వ్యాపారులు దుకాణాన్ని అధికమొత్తంలో అయినా అద్దెకు తీసుకోవడం వ్యాపారం నష్టంతో తిరిగి మూతపడడం జరుగుతూనే ఉన్నాయి.

ఖాళీ అవుతున్న దుకాణాలు

ముఖ్యంగా తణుకు పట్టణ పరిధి అత్యంత ఖరీదైన ప్రాంతంగా మారడంతో ప్రధాన రహదారుల్లో ఉన్న దుకాణాల అద్దెలు కూడా దానికి అనుగుణంగానే పెరిగాయి. దీనికితోడు ఒకే రకమైన వ్యాపారం పక్కనే మరొకటి వెలుస్తుండడంతో రెండింటి మధ్య పోటీతో వ్యాపారాన్ని పంచుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. దీంతో వ్యాపారస్తులు సైతం నష్టాలను తట్టుకోలేక వ్యాపారాన్ని మూసుకోవాల్సిన పరిస్థితి కూడా ఎదురవుతోంది. రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డు, సొసైటీ రోడ్డులలో వ్యాపార రంగం బాగా విస్తరించింది. దీంతో నెలకు వేలాది రూపాయిలు అద్దెలు చెల్లించి వ్యాపారాలు చేస్తున్నప్పటికీ ఖర్చులు, లాభానికి మధ్య వ్యత్యాసం భారీగా వస్తుండడంతో వ్యాపారాలు మూతపడుతున్నాయి. తణుకు వేల్పూరు రోడ్డులో దేశవ్యాప్తంగా భారీ వ్యాపార బ్రాంచ్‌లు ఉన్న ఒక వస్త్ర దుకాణం వ్యాపార నష్టంతో తోకముడిచేసిన దుస్థితి తణుకు వాసులకు తెలిసిందే.

కోవిడ్ తాకిడితో..

కంటికి కనిపించని కరోనా వైరస్ వ్యాపార రంగంలో తీవ్ర కలకలం రేపింది. చిన్న, మధ్య తరగతి వ్యాపార రంగంతోపాటు భారీ వ్యాపార రంగాన్ని సైతం కుదిపేసింది. కింగ్‌లుగా నడిచే వ్యాపారాలు సైతం డంగైపోవడంతో అద్దె దుకాణాల్లో నిర్వహించే వ్యాపారాలు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాయి. కోవిడ్ పరిస్థితులు తొలగిపోయి రెండేళ్లు గడుస్తున్నా ఆ చీకటి గాయం ఇంకా వ్యాపారరంగంపై కనిపిస్తోంది.

అద్దెలు అధికం



తణుకు పట్టణం చాలా ఖరీదైన ప్రాంతంగామారింది. ముఖ్యంగా ఏ వ్యాపారం చేయాలన్నా భారీగా అద్దెలు చెల్లించి దుకాణాలు అద్దెలకు తీసుకోవాల్సి వస్తుంది. వ్యాపా రాలు బాగోకపోవడంతో దుకాణ అద్దెలు చెల్లించలేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

– ఎస్వీ జాకబ్‌బాబు, తణుకు

వ్యాపారం లేదు..



వ్యాపారం బాగోకపోవడంతో చిన్నపాటి వ్యాపారాలు సైతం కుంటుపడుతున్నాయి. వ్యాపారం ఉన్నా లేకపోయినా దుకాణ అద్దెలు చెల్లింపులతోపాటు ఇతర ఖర్చులు తప్పక వ్యాపారాలు మూతపడే పరిస్థితి తలెత్తింది.

– కొమ్మోజు రామకృష్ణ, తణుకు

నిండా ముంచిన భారీ వర్షాలు

కుళ్లిపోతున్న నాట్లు, నారుమళ్లు


దువ్వలో వరి పొలంలో నీటిని తోడుతున్న రైతు

తణుకు టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరదలు తోడై ఖరీఫ్ రైతులను నిండా ముంచేశాయి. వాతావరణం సానుకూలంగా ఉందని గంపెడశలతో ఖరీఫ్ సాగుకు సిద్ధమైన రైతుకు సీజన్ ప్రారంభంలోనే కష్టాలు ఎదురయ్యాయి. నారుమళ్లు వేసిన నాట్లు ముంపు పాలవ్వడంతో ఏమీ చేయాలో తెలియడం లేదు. సీజన్ ప్రారంభంలోనే వర్షాలే కోలుకోలేని దెబ్బతీశాయి. ఎర్రకాలువ వరద ఉధృతి తగ్గడంతో తణుకు మండలంలోని దువ్వ వయ్యేరుకు వరద నీరు ప్రవాహం తగ్గి వరి పొలాల్లోని మురుగునీరు తగ్గుతుంది. దీనితో తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం, దువ్వ, తేతలి, మండపాక గ్రామాల్లోని వరద నీటిలో మునిగిన వరి పంట ఇప్పుడిప్పుడే తేరుకుంటుంది. గత వారం రోజులుగా వర్షపు నీరు, వరద నీటిలో మునిగిన వరి పంటను రైతులు తమ పొలాల్లోని వరదనీటిని బయటకు పంపించే పొలాల బాట పట్టారు. తణుకు మండలంలో ఎర్ర కాలువ, వయ్యేరు వదర కారణంగా కోనాల, ముద్దాపురం, దువ్వ, తేతలి, మండపాక గ్రామాల్లో 3,040 ఎకరాల్లోని వరి పంట ముంపుకు గురైనట్లు వ్యవసాయాధికారి కె కుసుమ తెలిపారు. మండలంలో మొత్తం 88 శాతం వరినాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కువగా ఎంటీయూ 1318, ఎంటీయూ 7029, పీఎల్‌ఏ 1100, పీఆర్ 126 రకాలను సాగు చేస్తున్నారని చెప్పారు. వరినాట్లు వేసిన వెంటనే పిలకదశలో ముంపుకు గురైతే నీటిని పూర్తిగా బయటకు తీసి తర్వాత పైపాటుగా ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను అదనంగా వేసుకోవాలని ఏవో కుసుమ తెలిపారు. ఈవిధంగా బూస్టర్ డోస్‌గా వేయడం వలన వరి మొక్కలు ముంపు నుంచి త్వరగా కోలుకుంటుందన్నారు. కుళ్ల తెగులు రాకుండా ఒక లీటరు నీటికి కార్బండిజం కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

వాసవీ మాతకు ఆషాఢం సారె అందజేత


అమ్మవారికి సారె అందజేస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో శ్రీ వాసవీ అమ్మవారికి ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, వబిలిశెట్టి నటరాజు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలచే గురువారం అషాఢం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రాలు మధ్య మేళ తాళాలతో భాజా భజంత్రీలు, తీన్మార్ డప్పులతో వెండి రథాన్ని, సారెను ఊరేగించారు. 300 మంది మహిళలచే చీరలు, గాజులు, పసుపు కుంకుమలతో, వివిధ రకాల పిండి వంటలతో అమ్మవారికి సారె సమర్పించారు. గమిని సుబ్బారావు, మహాలక్ష్మి దంపతులచే అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధి సత్యనారాయణ, మండవల్లి చెన్నా నాగేంద్ర, నున్న బాల త్రిపుర సుందరరావు, భోగవల్లి రమేష్, నాగలక్ష్మి, అచ్యుత లక్ష్మి పాల్గొన్నారు.

అత్తిలి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల అవస్థలు




అత్తిలి రైల్వేస్టేషన్ దృశ్యాలు

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌ను పునరుద్ధరించాలని కోరుతున్న ప్రజలు

అత్తిలి: దూర ప్రాంతాలు రైలు ప్రయాణం చేసే వారికి మండల పరిధిలో గల అత్తిలి రైల్వేస్టేషన్ ఎంతగానో ఉపయోగపడేది. గతంలో అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవి. దీంతో హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, తిరుపతి, విశాఖపట్నం, పూరి వంటి పట్టణాలకు అత్తిలి రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణించేవారు. రైల్వే డబ్లింగ్ పనులు చేపట్టిన సందర్భంలో అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌ను తొలగించారు. అయితే రైల్వే లైన్ ఆధునికీకరణ పనులు పూర్తైనప్పటికీ అత్తిలి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ పునరుద్ధరించ లేదు. దీంతో దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు తీవ్ర ఇక్కట్లు పడాల్సి వస్తోంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కడానికి అత్తిలి గ్రామానికి కిలోమీటర్ల దూరంలో ఉన్న తణుకు, భీమవరం స్టేషన్‌లకు అవస్థలు పడి వెళ్లి రైలు ఎక్కాల్సివస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాదిరిగా అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవిధంగా చర్యలు తీసుకోవాలని పలు రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు రైల్వే అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే 40 రైళ్లకు 30 స్టేషన్లలో ఈనెల 20 నుంచి 26 వరకు దశలవారీగా హాల్ట్‌లు కల్పిస్తూ రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయించారు. రైల్వే అధికారులు ప్రకటించిన జాబితాలో అత్తిలి రైల్వేస్టేషన్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. గత మూడేళ్లుగా అత్తిలి స్టేషన్‌లో ఏఒక్క ఎక్స్‌ప్రెస్ రైలును నిలుపుదల చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల అత్తిలి వచ్చిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అత్తిలి స్టేషన్‌లో కనీసం ఒక్క ఎక్స్‌ప్రెస్ అయినా నిలుపుదల అయ్యేలా చూస్తానంటూ హామీ ఇచ్చా రు. అయితే రైల్వే అధికారులు ప్రకటించిన హాల్ట్‌లలో అత్తిలి స్టేషన్‌లో ఏ ఎక్స్‌ప్రెస్‌కు కూడా హాల్ట్ కల్పించకపోవడంతో ప్రయాణికులు నిరాశ చెందారు.

హాల్ట్ పునరుద్ధరించాలి



గతంలో అత్తిలి రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవి. దూర ప్రాంతాలకు వెళ్లే అత్తిలి పరిసర గ్రామ ప్రజలకు ఈస్టేషన్ అనువుగా ఉండేది. డబ్లింగ్ పనులు సందర్భంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ రద్దు చేశారు. పనులు పూర్తైనప్పటికీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ నిలుపుదల చేయడంలేదు. దీంతో తణుకు, భీమవరం ప్రాంతాలకు వ్యయప్రయాసలతో వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారులు స్పందించి హాల్ట్‌ను పునరుద్ధరించాలి.

– దిరిశాల మునేశ్వరరావు దిరిశాల సత్యం సేవా సమితి అధ్యక్షుడు, అత్తిలి.

బాలికల చదువు భావితరాలకు వెలుగు


అత్తిలి: వరిఘేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది


తాడేపల్లిగూడెం అర్బన్: బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అత్తిలి: బాలికల చదువు భావితరాలకు వెలుగు అని ఐసీడీఎస్ సూపర్‌వైజ్ ఎం శ్రీదేవి అన్నారు. గురువారం అత్తిలి మండలం వరిఘేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో–బేటీ పడావోలో భాగంగా కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ అధికారిణి సత్యశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు సిహెచ్ బేబి, కె మీనాకుమారి, వై శ్రీదేవి, సావిత్రి పాల్గొన్నారు. అలాగే మంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 100 రోజుల మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహాలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ వెంకటరమణ, ఉపాధ్యాయులు కె సత్యశ్రీ, ఎం రత్నకుమారి, పీహెచ్ఎన్ పి సువర్ణ, ఎంఎస్‌కే వాణిశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఆరవల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మహిళా సంరోణ అధికారిణి లక్ష్మి, ఏఎన్ఎం విజయలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, వీఎల్ఎన్ కుమారి, సంది విజయ, సుగుణ, ఆశావర్కర్లు ధన లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం (టీటీసీ): మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సుజాతరాణి


తణుకు టౌన్ దువ్వలో అవగాహనా ర్యాలీ చేస్తున్న దృశ్యం

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తణుకు టౌన్: బాలికలకు 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేస్తే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ఐసీడీఎస్ సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

తాడేపల్లిగూడెం (టీటీసీ): నూతనంగా మార్పు చేసిన చట్టాలను తల్లిదండ్రులు తప్పక అవగాహన చేసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సుజాత రాణి పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వంద రోజుల మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 17వ వార్డులో అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుజాతరాణి మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ 1860ను భారతీయ న్యాయ సంహితగాను, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973ను భారతీయ న్యాయ సురక్ష సంహితగాను, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872ను భారతీయ సాక్ష్య అధినియంగాను మార్పు చేసినట్లు చెప్పారు. జూలై 1వ తేదీ నుంచి కొత్త చట్టాలు అమలు లోకి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ టీఎల సరస్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ దుర్గా భవానీ, కె.విశాలాక్షి, ఎం.ఎస్. కె.మంజుల తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్వహణపై అవగాహన

తాడేపల్లిగూడెం అర్బన్: ఆడపిల్లలను రక్షించుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐసీడిఎస్ సీడీపీఓ టీఎల్ సరస్వతి తెలిపారు. స్థానిక 24, 25 వార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రం వద్ద బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని అర్బన్ 2వ సెక్టార్ సూపర్‌వైజర్ విశాలాక్షి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ టీఎల్ సరస్వతి మాట్లాడుతూ ఆడపిల్లలను చదివిద్దాం, ఆడపిల్లలను రక్షించుకుందాం అనే అంశంపై పలు విషయాలను తెలియజేశారు. 24వ వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వావాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి, మోదుగ గుంట విద్యుత్ సబ్ స్టేషన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ డీఈఈ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. కుంచనపల్లి సబ్ స్టేషన్‌పరిధి కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకులగుంట, అమృతపురం, మోదుగ గుంట సబ్ స్టేషన్ పరిధి మోదుగ గుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, టిడ్కో సబ్ స్టేషన్‌కు సంబంధించి అగ్రహారం, టిడ్కో గృహాలకు, కొండ్రుప్రోలు, కేఎస్ఎన్.కాలనీలకు విద్యుత్ నిలుపుదల చేయబడునని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తణుకు: పట్టణంలో 11 కేవీ ఫీడర్ల వార్షిక మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం తణుకు పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. సొసైటీ రోడ్డు, వెంకటేశ్వర థియేటర్ సెంటర్, వేల్పూరు రోడ్డు, ఎన్జీవో కాలనీ, టి.వేమవరం, ఎన్టీఆర్ పార్కు, కొండాలమ్మ పుంత రోడ్డు, ఇరగవరం రోడ్డు, అజ్జరం రోడ్డు, ఇందిరమ్మ కాలనీ, ఉండ్రాజవరం జంక్షన్, సంతమార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహరించాలని కోరారు.

గ్రామ కార్యదర్శి మృతి

ఇరగవరం: మండలంలోని ఓగిడి గ్రామ పంచాయతీ కార్యదర్శి టీవీవీ ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతూ ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. కార్యదర్శి ప్రసాద్ మృతికి మండల పరిషత్ కార్యాలయంలో సంతాపం తెలిపారు. సెక్రటరీ కుటుంబ సభ్యులకు ఎంపీడీఓ పద్మజ్యోతి, సిబ్బంది ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.